క్లుప్తంగా

ఘన సన్మానం



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌టౌన్: షాద్‌నగర్ సెంట్రింగ్ అసోషియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్ జీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షుడు నడికూడ ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయక్, కోశాధికారి టేకులపల్లి నర్సింలును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు రాంమూర్తి, వెంకటేష్‌గౌడ్, రవియాదవ్, అశోక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

షాద్‌నగర్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును గురువారం కౌన్సిలర్ అగ్గనూరు విశాల లబ్ధిదారుడికి అందజేశారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన శ్రీశైలం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సీఎం సహాయనిధి నుంచి రూ.60వేలు మంజూరు చేయించారు. ఈ చెక్కును కౌన్సిలర్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ విశ్వం, నాయకులు అగ్గనూరు నందు, కిట్టు, ముకేష్, మల్లు, లక్ష్మణ్, జాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేస్తున్న దంపతులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో గురువారం పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సుతారి బాలేశ్వరీ, మంజుల, ప్రతాప్ కుమార్ దంపతులు,శ్రీకాంత్, శ్రీ చరణ్, పవన్‌కుమార్‌లు వెండి కిరీటంతో పాటుగా బంగారు రుద్రాక్ష మాలను బహూకరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో గురుస్వామి సతీషన్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి వెండి కిరీటం, బంగారు రుద్రాక్ష మాలతో అలకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోలెపు చంద్రశేఖర్, బసప్ప, రాఘవేందర్, రేటికల్ నందీశ్వర్, రెడ్డి రమేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ మండల కమిటీ ఎన్నిక

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల ముదిరాజ్ మహాసభ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుడుముల బాల్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా బైరమోని సతీష్, ర్యాకల రామకృష్ణ, మండల యువత అధ్యక్షుడిగా నర్సింహ్మ, యువత ఉపాధ్యక్షుడిగా రాఘవేందర్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు సంఘం తాలుక అధ్యక్షుడు అంచరాములు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు.

అభినందనలు



ఆంజనేయగౌడ్‌ను గజమాలతో సన్మానిస్తున్న సంఘం నేతలు

మొయినాబాద్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీఎస్) చైర్మన్‌గా నియమితులై ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ ఆంజనేయగౌడ్‌ను గౌడ సంఘం నేతలు అభినందించారు. గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు పాల్గొని ఆంజనేయ గౌడ్‌ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు బాల్‌రాజ్ గౌడ్, వెంకన్నగౌడ్, రామకృష్ణగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, రమేష్, విజయ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతం చేద్దాం

మొయినాబాద్‌రూరల్: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే భగత్‌సింగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేద్దామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో గల వన్ ఛాంపియన్ క్రికెట్ మైదానంలో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్‌సింగ్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు.

రానున్న ఎన్నికల్లో కాషాయ రెపరెపలు

మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి



షాబాద్: మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

షాబాద్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరాలని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల బీజేపీ నియోజకవర్గ పాలక్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల బూత్ కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను సీఎం కేసీఆర్ దారి మళ్లించి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురయ్యారని, గ్రామాల అభివృద్ధి సైతం కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో కేంద్రం నిధులు జమ చేయడంతో సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే పనిచేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలం చెందారని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ రాము, రవీందర్‌రెడ్డి, మహేందర్, హరీష్,మ హేష్, రవి గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

బూత్‌స్థాయి నుంచి నాయకులుగా ఎదగాలి

చేవెళ్ల: బూత్‌స్థాయిలో కార్యకర్తలు బలోపేతం అయితేనే ప్రజాప్రతినిధులుగా నాయకులుగా ఎదుగుతారని పార్టీ బలోపేతం అవుతుందని బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ పాలక్, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు అన్నారు. మండలకేంద్రంలో గురువారం చేవెళ్ల మండల బూత్‌స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అవినీతికి అధికార యంత్రాంగం వత్తాసు పలుకుతుందని దీనిని ఎండగట్టేందుకు సోషల్ మీడియా వేదికగా యువత స్పందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వ్యవహరించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ అందిస్తున్న పాలన గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజలకు మేలు చేసే బీజేపీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు నియోజకవర్గం నాయకులు జంగారెడ్డి, కంజర్ల ప్రకాశ్, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, అత్తెల్లి అనంత్‌రెడ్డి, బూత్‌స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.



చేవెళ్ల : సమావేశంలో పాల్గొన్న జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్‌కు ఓడీఎఫ్ ధ్రువపత్రం



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకుంటున్న కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2022లో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సాధించినందుకు గాను గురువారం మంత్రి కేటీఆర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు ధ్రువపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని దాశరథి ఆడిటోరియంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యంలో మెరుగైన ఫలితాలు సాధించిన మున్సిపాలిటీలకు మంత్రి కేటీఆర్ ధ్రువపత్రాలు అందజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ ఓడీఎఫ్ (బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణం) ప్లస్ ప్లస్ సాధించింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకన్న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ధృవపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సీడీఎంఏ సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత

మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



అండర్‌డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 1,10,14వార్డుల్లో రూ.14లక్షలతో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులను తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాగా, ప్రజలు కూడా పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్‌లు జూలకంటి స్వేతపాండురంగారెడ్డి, బొడ్డు లావణ్య శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, సంతోష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

బీజేపీ నాయకుడు బాలకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

షాద్‌నగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ నేతలు ముందుకు సాగాలని బీజేపీ నియోజకవర్గ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గడప గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని బూత్, శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలని చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు ముందుకు సాగాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, భూపాల్‌చారి, వెంకటేష్‌గుప్త, మిధున్‌రెడ్డి, డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న గోపాల్

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలకు ఎంపీపీ కుమారుడు పోతురాజు గోపాల్ గురువారం రూ.10 వేల విరాళం అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సరిపడ లేకపోవడం వల్ల విద్యా వలంటీర్ నియామకం కోసం తాను విరాళం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషశ్రీ, శివలింగమ్మ, స్వాతి పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతం చేయండి

వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్

కొందుర్గు: మండల కేంద్రంలో 7న నిర్వహించనున్న 16వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాజేష్‌పటేల్ మాట్లాడుతూ.. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామీణ స్థాయి క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. ఈ టోర్నమెంట్ రెండు విభాగాలుగా ఉంటుందని, ఓపెన్ టు ఆల్, రూరల్ విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓపెన్ టు ఆల్ విభాగంలో మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.25వేలు, మూడవ బహుమతి రూ.10వేలు, రూరల్ విభాగంలో మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.7500, మూడవ బహుమతి రూ.3వేలు ఉంటుందని తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరు కానున్నారని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, నరేందర్, మహేందర్, సత్యం, శ్రీను, శ్యామ్, రాజు, బాల్‌రాజ్, రవి పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: యువకులు క్రీడల్లో రాణించాలని హస్తేపూర్ సర్పంచ్ వెంకటయ్య, కాంగ్రెస్‌పార్టీ యువ నాయకుడు కావలి వెంకటేష్‌లు అన్నారు. మండలంలోని హస్తేపూర్ గ్రామ శివారులో గురువారం అంతారం గ్రామానికి చెందిన కావలి వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. క్రీడల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ఆటలు ఆడటం వల్ల యువకుల్లో ఉత్సాహం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలు మెరుగుపడుతాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.10వేల నగదు బహుమతి, షీల్డులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాండు, హరీశ్వర్, హరి, భూపాల్, ఆర్గనైజర్స్ కిట్టు, మహేశ్, ప్రశాంత్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాజేష్‌పటేల్

కొందుర్గు: ప్రస్తుతం అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. మండలంలోని వెంకిర్యాల గ్రామంలో గురువారం సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో ప్రతి పల్లెకు బీటీరోడ్డు, అంతర్గత మురుగుకాల్వలు, సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందన్నారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు మాసయ్య గౌడ్, గోవిందు, లింగం గౌడ్, రామకృష్ణ, నర్సింలు, మల్లేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగుపై సమీక్షా..

కొత్తూరు: కంటివెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంత్రి సబితారెడ్డి నేడు(శుక్రవారం) మధ్యాహ్నం 3.30 గంటలకు జూమ్ మీటింగ్‌లో సర్పంచులు, ఎంపీటీసీలకు పలు సలహాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్షా సమావేశంలో భాగంగా మండల సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసే జూమ్ మీటింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటాం

సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క



ఎస్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విక్రమార్క, ఉపాధ్యాయులు

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని భట్టి విక్రమార్క తెలిపినట్లు ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యూ.పోచయ్య పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండలంలో పని చేస్తున్న ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు యూ.పోచయ్యతో పాటు గోపాల్, రాంచందర్, సంఘం సభ్యులు కలిసి భట్టి విక్రమార్కను అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు, పదోన్నతులు, బదిలీలు, 317 జీవో, ఏకీకృత సర్వీసు రూల్స్ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలియజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని భట్టి విక్రమార్క తెలిపినట్లు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యూ.పోచయ్య, జిల్లా అధ్యక్షుడు గుండు యాదగిరి, కార్యదర్శి మన్సూర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గోపాల్, శ్రీనివాస్, రాంచందర్, ఆంజనేయులు, పుల్లయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెరువును కబ్జా చెర నుంచి రక్షించండి



తుమ్మసముద్రం చెరువులో మట్టి వేసిన ప్రాంతాన్ని చూపిస్తున్న వార్డు సభ్యులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని జనవాడ గ్రామ శివారులోని తుమ్మసముద్రం చెరువును నగరానికి చెందిన ఓ రియల్ వ్యాపారి కబ్జా చేశారని జనవాడ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బీర్ల శివరాజ్, చెన్నయ్య, రాధికఅశోక్‌లు ఆరోపించారు. గురువారం గ్రామ శివారులోని తుమ్మ సముద్రం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చెరువులను మరమత్తులు చేసి కాపాడాలని చూస్తుంటే కొంత మంది అక్రమార్కులు చెరువులను, శిఖం భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, తుమ్మ సముద్రంలో నీరు నిండుగా ఉన్నాయని తెలిపారు. నగరానికి చెందిన రియల్ వ్యాపారి చెరువు శిఖం భూమిలో మట్టిని పోసి చెరువును కబ్జా చేస్తున్నాడని అన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను కూడా వదలడం జరిగిందన్నారు. అలాగే చెరువుకు సుమారు 12ఎకరాలు భూమి ఉందని తెలిపారు. గత నెల 17వ తేదీన చెరువులో మట్టిని వేస్తుండగా అడ్డుకోవడం జరిగిందని, ఇరిగేషన్ అధికారులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే, రియల్ వ్యాపారిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారని చెప్పారు. మళ్లీ చెరువు భూమికి ప్రహరీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుమ్మ సముద్రం చెరువును కాపాడాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న యువకులు

షాద్‌నగర్‌రూరల్: చలికాలం దృష్టిలో పెట్టుకొని సామాజికవేత్త నర్సింగ్‌రాథోడ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీసీ మహాసభ రాష్ట్రకార్యదర్శి ప్రదీప్‌కుమార్ హాజరై పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...చలికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులను దృష్టిలో పెట్టుకొని దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చందర్‌బాబు, శ్రీనివాస్, పవన్, మురళి పాల్గొన్నారు.

నక్షరోడ్డును కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం

శంకర్‌పల్లి: మండలంలోని గోపులారం–చిన్న మంగళారం నక్ష రోడ్డును కబ్జా చేసి అక్రమంగా ఇళ్లు నిర్మాణం చేస్తున్నారని నగరానికి చెందిన శుభాకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గోపులారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 109 పక్కన ఉన్న చిన్న మంగళారానికి వెళ్లే రోడ్డును కబ్జా చేసి గ్రామానికి చెందిన వ్యక్తి ఇళ్లను నిర్మాణం చేస్తున్నాడని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు అందించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

బంధం మరిచి..కన్న కూతురిని చెరిచి..

- కూతురుపై .. తండ్రి కామవాంఛ
- షాద్‌నగర్‌లో పోలీసులను ఆశ్రయించిన ఓ బాలిక
- నిందితుడికి రిమాండ్

షాద్‌నగర్‌రూరల్: మానవత్వం మంట గలిసిపోతుంది.. మాన సంబంధాలు, బంధుత్వాలు మరిచి మనుషులు మృగలుగా మారుతున్నారు..కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే కామపిశాచిలా మారాడు...తల్లి లేని బిడ్డ ఆలనా పాలనా చూడాల్సిన తండ్రి కర్కశత్వంగా తయారయ్యాడు. రక్తసంబంధం మరిచి కూతురిపైనే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి గత 9 సంవత్సరాల క్రితం భార్య చనిపోయింది. అతనికి కూతురు(14) ఉంది. భార్య మరణించిన తరువాత మరో పెళ్లి చేసుకోలేదు. ఆ ఇంట్లో తండ్రి కూతురు మాత్రమే నివాసం ఉంటున్నారు. కూతురు ప్రస్తుతం పక్క గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. తల్లిలేని బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాల్సిన కన్న తండ్రి మానవ మృగంలా మారాడు. కొన్ని ఏళ్లుగా కూతురుపై అఘాయిత్యానికి పాల్పడుతూ తన కామవాంఛ తీర్చుకుంటున్నాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా బాలికను ఎవరితో మాట్లాడనీయకుండా జాగ్రత్త పడేవాడు. ఎవరికి అనుమానం రాకుండా ప్రతిరోజు కూతురును పాఠశాల వద్ద వదిలిపెట్టి సాయంత్రం తీసుకువెళ్లేవాడు.

బాలికలో మార్పు రావడంతో..

బాలిక శరీరంలో మార్పులు రావడం, తరగతి గదిలో ఎవరితో మాట్లాడకుండా ఉండటాన్ని గత మూడు రోజుల క్రితం ఉపాధ్యాయునీలు గమనించారు. దీంతో బాలికను ప్రత్యేక గదిలోకి పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. నీ శరీరంలో మార్పులు రావడానికి కారణాలు ఏమిటి, నీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని బాలికను విచారించారు. నీవు ఎలాంటి భయం చెందాల్సిన అవసరం లేదు. ఏమి జరిగిందో నిర్భయంగా చెప్పు అని ఉపాధ్యాయునీలు కోరారు. దీంతో ఆ బాలిక జరిగిన విషయాలను వారికి చెప్పింది. గత కొన్ని సంవత్సరాలుగా కన్నతండ్రి నాపై అఘాయిత్యానికి పాల్పడుతూ కామవాంఛ తీర్చుకుంటున్నాడని బాలిక చెప్పడంతో ఉపాధ్యాయునీలు నివ్వెరపోయారు.

షీటీంకు సమాచారం అందించి..

బాలిక వివరాలను ఉపాధ్యాయులు అదే రోజు షీటీం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న షీటీం పోలీసులు పాఠశాల వద్దకు చేరుకొని బాలికను విచారించి వివరాలను తెలుసుకున్నారు. దీంతో మీ కూతురు కళ్లు తిరిగి పడిపోయింది మీరు తొందరగా పాఠశాల వద్దకు రావాలని బాలిక తండ్రికి ఫోన్ చేశారు. బాలికను ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించడంతో 5 నెలల గర్భవతి అని తేలింది. పాఠశాల వద్దకు వచ్చిన తండ్రిని షీటీం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడికి రిమాండ్

కన్న కూతురుపై అఘాయిత్యానికి పాల్పడుతూ కామవాంఛ తీర్చుకుంటున్న తండ్రిపై బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నవీకుమార్ తెలిపారు.